
సాక్షి
గుంటూరు
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 563.30 అడుగుల వద్ద ఉంది. ఇది 240.1256 టీఎంసీలకు సమానంగా ఉంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4200క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు ఆభరణాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రూ.11 లక్షల విలువైన బంగారు కాసుల పేరు, తామర పుష్పాన్ని భక్తులు కానుకగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన నాదేళ్ల సుధారాణి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఈఈ కోటేశ్వరరావును కలిసి సుధారాణి పేరిట 178 గ్రాముల బంగారంతో తయారు చేయించిన కాసుల పేరును, 41 గ్రాముల బంగారంతో తయారు చేయించిన తామర పుష్పాన్ని చెన్నుపాటి కోటేశ్వరమ్మ పేరిట అమ్మవారికి కానుకగా సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు ప్రసాదాలు, శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

హైవే పనులను సమన్వయంతో నిర్వహించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో జాతీయ రహదారి (హైవే) పనులను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. జాతీయ రహదారులకు సంబంధించి వివిధశాఖల అధికారులతో ఆయన సోమవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి –16కు అనుసంధానంగా పొట్టిపాడు నుంచి ఉయ్యూరు మీదుగా గుంటూరు జిల్లాలోని కాజ వరకు బైపాస్ రహదారి పనులను అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. విజయవాడ తూర్పు వైపు నిర్మించాల్సి ఉన్న ఈ బైపాస్ రహదారికి అధికారులు నాలుగు ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. ఈ రహదారిలో మద్దూరు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మించేలా ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1200 నుంచి రూ.1500 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారని వివరించారు. భూసేకరణకు సుమారు రూ.400 కోట్లు అవసరమని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందని కలెక్టర్‌కు జాతీయ రహదారుల అధికారులు తెలిపారు. ఈ బైపాస్ రహదారి నిర్మాణం వల్ల ఎన్‌హెచ్ –16 పై విజయవాడ వద్ద ట్రాఫిక్ తగ్గించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి ఈ రహదారి ప్రారంభమై గుంటూరు సమీపంలోని చిన కాకాని గ్రామం వద్ద ముగుస్తుందన్నారు. మొత్తం 49 కిలో మీటర్ల మేర ఈ రహదారిని నిర్మించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలు, గుంటూరు జిల్లాలో నాలుగు మండలాల మీదుగా ఈ రహదారి వెళ్తుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ.కిషోర్, పద్మావతి, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి.వి.నారాయణ, డీపీఆర్ కన్సల్టెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యార్డుకు భారీగా మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,25,443 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 1,06,811 బస్తాలు విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యతగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. అందుకే రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకువస్తే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 – రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 – రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చి రూ.4,500 – రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,124 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

విద్యార్థుల భవితపై పెట్టుబడి

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ, నూతన భవనాలను నిర్మిస్తూ, నాణ్యమైన ఆహారాన్నందిస్తూ మంచి వాతావరణంలో విద్యఅందేలా చర్యలు తీసుకుంటోంది. వీటికి రూ.కోట్లు ఖర్చవుతున్నా వీటిని ఖర్చుగా కాకుండా విద్యార్థుల భవితపై పెట్టిన పెట్టుబడిగానే చూస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. వేగంగా జరుగుతున్న నాడు–నేడు రెండో విడత పనులతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు కొత్తరూపు సంతరించుకోనున్నాయి.

- శరవేగంగా నాడు–నేడు రెండో దశ పనులు
- జిల్లాలోని 563 స్కూళ్లలో రూ.215.75 కోట్ల వ్యయంతో శరవేగంగా పనులు
- 10 అంశాల ప్రాతిపదికన పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన
- 165 పాఠశాలల పరిధిలో కొత్తగా 838 తరగతి గదుల నిర్మాణం
- ఉన్నత పాఠశాలల్లో విలీనమైన 3,4,5 తరగతులకు సరిపడా తరగతి గదుల నిర్మాణం



నాడు–నేడు రెండో విడత పనులు జరుగుతున్న గుంటూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన నాడు–నేడు రెండో దశ పనులు గుంటూరు జిల్లాలో శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,149 పాఠశాలలను రూ.242. 19 కోట్ల వ్యయంతో ఆధునికీకరించిన పాఠశాలలే ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఆధునికీకరించిన భవనాలు, తరగతి గదులు, ఆకట్టుకునే ఫ్లోరింగ్, ఆహ్లాదకరమైన ప్రాంగణం, తరగతి గదుల్లో పూర్తిస్థాయిలో విద్యుదీకరణ, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ బల్బులు, బాలికలు, బాలురకు వేర్వేరుగా నిర్మించిన టాయిలెట్లలో ప్రపంచస్థాయిలో పేరెన్నికగన్న బ్రాండెడ్ సామగ్రితో మొదటి దశలో ఆధునికీకరణతో పాఠశాలల స్వరూపాన్ని ప్రభుత్వం పూర్తిగా మార్చివేసింది. విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనంగా ఆధునిక హంగులతో మౌలిక వసతులను సంతరించుకున్న పాఠశాలలు నిలుస్తున్నాయి. రెండో విడత పనులను వచ్చే విద్యాసంవత్సరానికి పూర్తి చేసి, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనులు సాగుతున్నాయి.

563 స్కూళ్లలో రూ.215.75 కోట్ల వ్యయంతో...

మొదటి దశలో అభివృద్ధి పర్చిన పాఠశాలల బాటలో ప్రస్తుతం రెండో విడతలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా 563 పాఠశాలల్లో రూ.215.75 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు పురోగతిలో ఉన్నాయి. నాడు–నేడు రెండో దశ పనుల్లో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చడంతో పాటు ఆధునిక సదుపాయాలు, అదనపు తరగతిగదుల నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వ సమూలంగా మార్చివేయనుంది. 563 పాఠశాలలకు గాను 561 పాఠశాలల పేరెంట్ కమిటీల బ్యాంకు ఖాతాల్లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద జమచేసిన రూ.42.21 కోట్లతో పనులను ప్రారంభించారు.

కొత్తగా 838 తరగతి గదుల నిర్మాణం..

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గంతో పాటు మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, తాడికొండ, తెనాలి నియోజకవర్గాల పరిధిలోని 165 పాఠశాలల్లో 838 అదనపు తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులకు సరిపడా తరగతి గదులను నాడు–నేడు రెండో విడతలో చేపడుతున్నారు. నాడు–నేడు పుణ్యమాని జిల్లాలోని వివిధ పాఠశాలలను రూ.లక్షలు వెచ్చించి ఆధునికీకరిస్తున్నారు. గుంటూరు నగరంలో వందేళ్ల చరిత్ర కలిగిన ఉర్దూ బాయ్స్ స్కూల్‌గా ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రూ.68 లక్షల వ్యయంతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్‌టీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.60 లక్షలతో ఎనిమిది తరగతి గదుల నిర్మాణం పురోగతిలో ఉంది. జిల్లాలోని మిగిలిన పాఠశాలల్లోనూ ఇదే విధంగా ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పనులు..

నాడు–నేడు రెండో విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 10 అంశాల ప్రాతిపదికన మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అవసరమైన విధంగా అదనపు తరగతి గదుల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. పనుల పురోగతిని బట్టి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది.

– పి.శైలజ, గుంటూరు డీఈఓ.



గుంటూరు కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్టీ హైస్కూల్‌లో జరుగుతున్న పనులు

నకిలీ న్యాయవాదులకు ముందస్తు బెయిల్ తిరస్కరణ

గుంటూరు లీగల్: నకిలీ న్యాయవాదుల ముందస్తు బెయిల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి సోమవారం తిరస్కరించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన బెక్కి నాగేశ్వరరావు, మార్చేర్లా వెంకటేశ్వరరావు బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఉన్న మంకథ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ సర్టిఫికెట్ పొందారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా నమోదయ్యారు. అనంతరం సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏపీ బార్ కౌన్సిల్ ఇటీవల చేపట్టిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది నకిలీ లా డిగ్రీ సర్టిఫికెట్లతో ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని న్యాయవాదులుగా చలామణి అవుతున్నట్లు గుర్తించారు. వారి పేర్లతో సహా ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఇటీవల తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో మొదటి, రెండో ముద్దాయిలుగా ఉన్న నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని జిల్లా కోర్టులో పిటీషన్ దాఖలు చేసుకున్నారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. తాము నిర్దోషులమని నిందితులు వాదనలు వినిపించారు. పోలీసుల ఇన్వెస్టిగేషన్ జరుగుతున్న నేపథ్యంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయకూడదని జిల్లా కోర్టు పీపీ మహమ్మద్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదించారు. ఈ క్రమంలో నిందితులకు ముందస్తు బెయిల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి తిరస్కరించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2900, గరిష్ట ధర రూ.3600, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.

మలి సంధ్యలో విషాద గీతిక

తమ కళ్ల ముందే తామెంతో గారాబంగా పెంచి, పెద్దచేసిన కుమారుడు అనారోగ్యంతో మంచానపడి మరణించడాన్ని తట్టుకోలేని ఆ ముదుసలి హృదయాలకు ఎదిగొచ్చిన మనమడు ఆత్మహత్య చేసుకోవడం మరింత మానని గాయమై కుంగదీసింది.. తీపి జ్ఞాపకాల దొంతరలో గడిచిపోవాల్సిన వార్ధక్యం ఇలా వరుస విషాదాలతో నిండిపోవడం ఆ వృద్ధ జంట తట్టుకోలేక పోయింది. కోడలి తీవ్ర అనారోగ్యం.. ఆర్థిక సమస్యలు.. మరో కుమారుడు దూరంగా ఉండడం వంటి ఘటనలతో తమ జీవిత ప్రయాణమనే నావ దరి దాపులో కాంతి పుంజం కనిపించక, చుట్టూ చీకటి అలుముకున్నట్లు అగుపించడంతో ఆ ప్రయాణానికి బలవంతంగా ముగింపు పలికారు. మరణంలోనూ ఒక్కటిగానే ముందుకుసాగారు.

- దమ్మాలపాడులో వృద్ధ దంపతులు ఆత్మహత్య
- కుటుంబానికి భారం కాకూడదనే తీవ్ర మనస్థాపం



ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధ దంపతులు వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంలు(ఫైల్)

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): విధి ఆ కుటుంబం పాలిట శాపమైంది. ఒకప్పుడు బాగా బతికి.. నేడు పూట గడవటానికి కూడా చేతులు చాపాల్సి వస్తుందేమో అనే మనస్థాపం వారిని మరింత వేదనకు గురి చేసింది. ఎవరికీ భారంగా మారకూడదని కూడబలుక్కొన్న ఆ వృద్ధ దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన అన్నెంవెంకటేశ్వర్లు(71), సామ్రాజ్యం(62)లకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు కాగా, ఒక కుమార్తె ఉంది. గతంలో అందరిలాగే తనకున్న ఎకరన్నర సొంత భూమితో పాటుగా మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వెంకటేశ్వర్లు బాగా వ్యవసాయం చేసేవాడు. అందరికీ పెళ్లిల్లు చేసి, తాను కట్టుకున్న పక్కాగృహంలోనే నివాసం ఉంటున్నారు. వయోభారంతో ఇంటికే పరిమితం అయ్యారు. ఈ క్రమంలో గత రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడు మస్తాన్‌రావు కిడ్నీలు పాడవటంతో కోడలు బాలమ్మ కిడ్నీ దానం చేసింది. సుమారు రూ.18లక్షల వరకు ఖర్చయింది. మస్తాన్‌రావు వాటా కింద వచ్చిన అర ఎకరం పొలం అమ్మి కొంత మేర అప్పులు తీర్చారు. అయినప్పటికీ మస్తాన్‌రావు మృతి చెందాడు. పెద్ద కొడుకు మృతి చెందటంతో వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంలు పెద్ద కోడలు వద్దే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో మస్తాన్‌రావు పెద్ద కొడుకు ప్రసాద్ కూడా నరసరావుపేటలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్ద కోడలు కూడా భర్తకు కిడ్నీ దానం చేయటంతో తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉండటంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంల చిన్న కొడుకు వెంకట్రావు నరసరావుపేట వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.

వృద్ధాప్య పింఛనే ఆధారం....

వెంకటేశ్వర్లు, సామ్రాజ్యంలకు ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ సాయమే ఆధారంగా మారింది. కూలి పనులకు వెళితే తప్ప ఇల్లు గడవని పరిస్థితి. ఒక వైపు పెద్దకోడలి ఆరోగ్యం అంతంత మాత్రం కావటం, చిన్న మనవడి చదువు నిలిచిపోయే పరిస్థితిని చూసి వృద్ధ దంపతులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. కుటుంబానికి భారం కాకూడదని భావించి పొలానికి తెచ్చుకున్న పురుగుమందు తాగి ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెల్లవారే సరికే ఇరువురు మృత్యువాత పడ్డారు.

చివరి మజిలీలోను....

వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం దంపతులు పెళ్లయిన నాటినుంచే అన్యోన్యంగా ఉంటూ అందరికీ ఆదర్శంగా ఉండేవారని గ్రామస్తులు చెబుతున్నారు. వ్యవసాయ పనులతో పాటుగా ఏ పని చేసినా కూడా ఇద్దరూ కలిసే చేస్తారని స్థానికులు చెబుతున్నారు. చివరి మజిలీలోను కలిసే మృతి చెందటం వారి అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా గ్రామస్తులు చెప్పుకొంటున్నారు. వృద్ధులైన దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

పిల్లలకు ఉరివేసి తల్లి ఆత్మహత్య

- క్షణికావేశంలో మహిళ ఘాతుకం
- సంఘటనలో ముగ్గురు మృతి
- మరో మహిళతో భర్త సహజీవనమే ఘటనకు కారణం



దొండేటి శివలింగేశ్వరి, చరణ్‌సాయిరెడ్డి, జతిన్‌రెడ్డి మృతదేహాలు

నరసరావుపేటటౌన్: ఇద్దరు పిల్లలకు ఉరివేసి ఆపై తల్లి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం నరసరావుపేట పట్టణంలో చోటుచేసుకుంది. తన కుమార్తె మరణానికి ఆమె భర్త వేధింపులే కారణమంటూ మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్ర బాబు తెలిపారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెలంరాజుపల్లి గ్రామానికి చెందిన దొండేటి ఇంద్రసేనారెడ్డికి రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామానికి చెందిన శివలింగేశ్వరి(27)తో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. స్థానిక పెద్దచెరువు మహాలక్ష్మమ్మ నగర్‌లో ఏడేళ్లుగా వీరు నివాసం ఉంటున్నారు. వీరికి చరణ్ సాయి రెడ్డి(6), జతిన్ రెడ్డి(4) సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు రెండో తరగతి, రెండోవాడు నర్సరీ చదువుతున్నారు. ఇంద్రసేనారెడ్డి గుంటూరు రోడ్డులో ట్రాక్టర్ మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. శివలింగేశ్వరి మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌లో టైలరింగ్ పనికి వెళ్తుంది. మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తరచూ మద్యం తాగి భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయమై కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదం కొనసాగుతుంది. భర్త వేధిస్తున్నాడని వారితో కలసి అదే ఇంట్లో ఉంటున్న అత్తమామలకు పలుమార్లు చెప్పినా వారు పట్టించుకోలేదు. ఈక్రమంలో సోమవారం ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. పిల్లలను పాఠశాలలో విడిచి పెట్టాలని భర్తను కోరగా పట్టించుకోకుండా వెళ్లాడు. మామ నారాయణరెడ్డిని పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్లాలని కోరగా అతను పని ఉందని వెళ్లిపోయాడు. ఈక్రమంలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మామ నారాయణరెడ్డి ఇంటికి వచ్చి చూడగా తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు ఉరివేసుకొని పిల్లలిద్దరూ వేలాడుతూ కనిపించారు. చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా అప్పటికే చిన్నారులిద్దరూ మృతి చెంది ఉన్నారు. మరో రూమ్‌లో శివలింగేశ్వరి ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. ఆమెను కిందకు దించి పరిశీలించగా మృతి చెందినట్టు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సీఐ వీరేంద్రబాబు, ఎస్‌ఐ షేక్ రహంతుల్లా సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ విజయ భాస్కరరావు మార్చ్యురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. ఈ మేరకు మృతురాలి తల్లి ద్రాక్షాయని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. భర్త ఇంద్రసేనారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మిర్చి రైతుల ఆకలి తీర్చేలా..

- యార్డులో ఉచిత భోజన పథకం ప్రారంభం
- ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం చేసే అవకాశం
- మిర్చి యార్డు ఛైర్మన్ ఏసురత్నం



భోజనం నాణ్యతను రైతులను అడిగి తెలుసుకుంటున్న యార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం యార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ప్రారంభించారు. రైతులకు స్వయంగా ఆయన భోజనం వడ్డించి, భోజనం, రుచులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఏసురత్నం మాట్లాడుతూ రైతులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతులు నేరుగా యార్డుకు తమ సరుకును తీసుకువచ్చి విక్రయించుకుంటే మంచి ధర వస్తుందని, దళారులను నమ్మడం వల్ల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని స్పష్టం చేశారు. గత మూడేళ్లుగా ఇంటర్నేషనల్ మార్కెట్, డొమెస్టిక్ మార్కెట్‌లలో ధరలు ఆశించిన మేర ఉండటంతో రైతుకు మంచి ధరలు లభిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది మిర్చి సీజన్‌లో రూ.8,500 కోట్ల వ్యాపారం చేయడం జరిగిందని, యార్డు పాలకవర్గం, అధికారుల సమన్వయంతో ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం చేసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసం నుంచి యార్డుకు భారీస్థాయిలో మిర్చి వస్తుంటుందని, కానీ ఈ ఏడాది జనవరి ప్రారంభం నుంచే భారీస్థాయిలో యార్డుకు రైతులు మిర్చి బస్తాలను తరలిస్తున్నారన్నారు. మిర్చి ధరలు కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో రైతులు తాము పండించిన పంటలను యార్డుకు తరలించి విక్రయించుకుంటున్నారని తెలిపారు. గుంటూరు మార్కెట్ యార్డును ప్రపంచంలోనే అత్యుత్తమ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. యార్డు వైస్ ఛైర్మన్ సుధాకరరెడ్డి, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

• బోనమెత్తిన భక్తజనం

పెనుగంచిప్రోలులో వేంచేసియున్న తిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల రెండో రోజు సోమవారం కొనసాగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించారు. దీక్ష విరమించిన స్వాములు తెల్లవారుజామునే మునేరులో స్నానమాచరించి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఆదివారం రాత్రి కల్యాణం అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో గ్రామంలోని ఆలయాల్లో, ఇసుక తిన్నెల మీద సేదదీరారు.

– పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట)



అమ్మవారికి పొంగళ్లు చేస్తున్న భక్తులు

ప్రతి సమస్యా ఒక అనుభవమే

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- స్పందనలో 143 అర్జీలు



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం అధికారులకు, ఉద్యోగులకు నేర్చుకునేందుకు గొప్ప అవకాశం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అనేక సమస్యలు ఒకే వేదికపైకి రావడం, వాటిని వివిధ ప్రభుత్వ శాఖలు పరిష్కరించే క్రమంలో ఉద్యోగులకు ఎన్నో సమస్యలు అర్థమవుతాయన్నారు. అర్జీల పరిష్కారానికి మరింత వేగంగా పని చేయాలన్నారు. మొత్తం అందిన 143 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు. వాటిలో కొన్ని ఫిర్యాదులు..

రుణం మంజూరైనా ఇవ్వడంలేదు..



మైక్ సెట్ వ్యాపారం భారీ స్థాయిలో చేసేందుకు పరిశ్రమల శాఖకు రూ.10 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకున్నాను. దీనికి గాను నంబూరు గ్రామీణ చైతన్య గోదావరి బ్యాంకుకు నా దరఖాస్తును పంపారు. కావాల్సిన హామీ ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నాను. ఆరు నెలల నుంచి తిప్పుతున్నారు. రుణం మంజూరయ్యిందంటూనే వేధిస్తున్నారు. నాకు న్యాయం చేయండి.

– ఎన్.విజయ భాస్కరరావు, నంబూరు

అంబేడ్కర్ భవనాన్ని పునర్నిర్మించండి



స్థానిక ఏసీ కళాశాల ఎదుట దళితుల కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడే అంబేడ్కర్ భవన్ ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. దీనికి తక్షణం నిధులు కేటాయించి నూతన భవనాన్ని నిర్మిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. దీనిపై గతంలోనూ ఎన్నో అర్జీలు ఇచ్చినా స్పందించలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ అంబేడ్కర్ భవన నిర్మాణ సాధన కమిటీ

ఫిర్యాదిదారులతో మర్యాదగా మెలగాలి

నగరంపాలెం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా మెలగాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ సూచించారు. తూర్పు సబ్ డివిజన్‌లోని పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ (పీఎస్)ను సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సిబ్బంది పనితీరు గుర్తించి వారికి పలు సూచనలు సూచించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్పీకి సీఐ సుబ్బారావు వివరించారు. పీఎస్ పరిధిలో మాదక ద్రవ్యాల వాడకంపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, తూర్పు డీఎస్పీ బి.సీతారామయ్య, పాతగుంటూరు పీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

IN THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Ground & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam - 530020
O. A. No 843 /2022

Between :
THE SOUTH INDIAN Bank LTD
Guntur Branch, D.No.4-1-1, Gayathri Road, Beside Hari Hara Mahal, Guntur. Andhra Pradesh
rep by its Branch Manager --- APPLICANT BANK
And :
M/s Sai Malliswerl Egg Traders
Rep by its Proprietor
Mr. Dhulipalla Srikanth & Others --- DEFENDANTS

SUMMONS TO DEFENDANTS BY PAPER PUBLICATION

To
Defendants No. 1 to 5:

1. **M/s SAI MALLISWARI EGG TRADERS,** Rep by its Proprietor Mr. Dhulipalla Srikanth, APHP Colony, Ward No.29, Guntur, Andhra Pradesh - 522006.
2. **Mr. DHULIPALLA SRIKANTH,** S/o Mr. DHULIPALLA ANKAMMA RAO. R/o F.No.302. SreeNilayam Apartments. H.B Colony, 5th Lane, Guntur, Andhra Pradesh- 522006
3. **Mrs. SANDHYA RANI DHULIPALLA** W/o DHULIPALLA SRIKANTH, R/o F.No. 302, SreeNilayam Apartments, H.B Colony, 5th Lane, Guntur, Andhra Pradesh - 522006
4. **Mrs. MIHIKA CHENNUPATI** W/o Mr. ARAVIND BABU, R/o D.No.6-1-10, SeelamVaari Street, Bapatla, Guntur, Andhra Pradesh - 522101
5. **Mrs. CHAPALAMADUGU NALINI DEVI** W/o Mr. UDAYA BHASKARA RAO. R/o House No. 8-6-101. 5th lane, Nehru Nagar, Kothapeta, Guntur, Andhra Pradesh- 522001

1. WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m. or at such time immediately thereafter according to the convenience of Tribunal on 17th FEBRUARY, 2023 to answer the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
5. Take notice that, in default of, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the 13th day of January, 2023

Sd/- **Signature of the Officer Authorised to issue summons**

ఏపీ లోకేష్ ఫాలోవర్స్ పేరుతో మోసం

అంగలకుదురుకు చెందిన ఓ శ్రీనివాసరావు ప్రైవేటు ఇన్సూరెన్స్‌లో పనిచేస్తున్నాడు.. ఇటీవల 'ఏపీ లోకేష్ ఫాలోవర్స్' అనే వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఆ గ్రూప్‌లోని ఒకరు ప్రైవేటు రుణాలు ఇప్పిస్తానని మేసేజ్ పెట్టాడు. రుణ కోసం దరఖాస్తు కోసం ఈనెల 2న మొబైల్ వాట్సాప్ నంబర్ ద్వారా అతడికి వివరాలు ఇచ్చాడు. బ్యాంక్ సిబిల్ సరిగాలేదని, అందుకుగాను రూ.3,800 ఫోన్ పే చేయాలని కోరగా వెంటనే చెల్లించాడు. అనంతరం రూ.3 లక్షల రుణం మంజూరు అయింది, రూ.30 వేలు తొలిసారి, రెండోసారి రూ.35 వేలు చెల్లించాడు. మళ్లీ డబ్బులు కోరడంతో నిరాకరించాడు. ఇప్పటి వరకు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా మాది కాకినాడలో పెద్ద రాజకీయ కుటుంబం, నీ కుటుంబాన్ని నాశనం చేస్తానని హెచ్చరించాడు. దీంతో స్పందనలో ఎస్పీని ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రకాష్‌బాబు

స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన (గ్రీవెన్స్) నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అర్జీదారులతో మాట్లాడి, సమస్యలను ఆలకించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని, చట్ట ప్రకారం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. నిర్ణీత వేళల్లో విచారించి, న్యాయం అందించాలని అన్నారు. సమస్యలను పరిష్కరించిన నివేదికలను సత్వర మే జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఏఎస్పీ శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీ ప్రకాష్‌బాబు (క్రైం) అర్జీలు స్వీకరించారు.

రూ.3 కోట్లతో ఉడాయింపు..

కోట్లాది రూపాయల ధాన్యం సొమ్ము చెల్లించకుండా ఓ రైస్ మిల్లు యాజమాని ఉడాయించినట్లు రైతులు విన్నవించారు. 2018 నుంచి మునిపల్లెలోని ఓ రైస్ మిల్లు నిర్వాహకుడు ధాన్యం కొనుగోలు చేసేవాడు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులు రెండు వారాల్లో దఫాల వారీగా చెల్లించేవారు. గతేడాదిలో రైతులు అందరూ విడతల వారీగా ధాన్యాన్ని రైస్ మిల్లులో అప్పగించాం. గతంలో చెల్లించాల్సిన పాత, ప్రస్తుత బకాయిలు సుమారు రూ.3 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. బకాయిల చెల్లింపులపై అనేకమార్లు అడిగినా కాలయాపన చేయడమేగాక నోట్లు రాసిచ్చేవారు. అనుకూలమైన కొందరికి చెల్లింపులు చేసినట్లు తెలిసింది. అదేమని అడిగితే కులం పేరుతో దూషించేవారు. వారికున్న రాజకీయ పలుకుబడి, రౌడీ షీటర్లతోనూ బెదిరించేవారు. ఇటీవల ఊరు విడిచి వెళ్లినట్లు తెలిసింది. బెదిరిస్తున్న వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని, న్యాయం చేకూర్చాలని కోరుతున్నాం..

– చిన్నసుబ్బారావు, జి.శ్యాంకుమార్, దాసరి అచ్చెయ్య, మోహన్‌రావు, ఎం.భాస్కరరావు, మునిపల్లి, దండమూడి, మామిళ్లపల్లి గ్రామాల రైతులు

పెళ్లి పేరుతో మోసం..

ఏడేళ్ల క్రితం భార్య చనిపోయింది. సుమారు 8 నెలలు క్రితం నా ఫోన్‌కు కాల్ చేసి ఓ మహిళ మాట్లాడింది. భర్త మద్యం మత్తులో చిత్రహింసలకు గురిచేసేవాడని తెలిపింది. ఆమె తల్లి కూడా మాట్లాడి, మా అల్లుడితో కుమార్తె విడిపోయేందుకు రూ.3 లక్షలు అవసరమని చెప్పింది. భర్తతో విడిపోయి తనను పెళ్లి చేసుకుంటానని ఆమె నమ్మబలికింది. ఈలోగా భర్త మానసికంగా వేధిస్తున్నాడని చెప్పి, నా వద్ద దఫాల వారీగా లక్షల్లో కాజేసింది. దీంతో మోసపోయినట్లు గుర్తించాను. అయితే భార్యాభర్తల తోపాటు మరో మహిళ జట్టుగా కలిసి పలువుర్ని మోసగించి జల్సాలు చేసేవారని తెలిసింది. ఇటీవల డబ్బులు ఇప్పిస్తామనని చెప్పి ఆటోతో ఢీకొట్టించారు. న్యాయం చేయగలరు..

– కరిముల్లా, పొన్నూరు

ఇంకనూ చెల్లించాలని ఒత్తిడి..

ఇటీవల ఒకరి రూ.4 లక్షలు అప్పు తీసుకుని అధిక వడ్డీలు చెల్లించి, ఒప్పందం రద్దు చేసుకున్నాం. అయినప్పటికి సదరు వ్యక్తి ఇంకా రూ.1.20 లక్షలు చెల్లించాలని బెదిరిస్తున్నారు. ఈనెల 5న మా ఇంటి వద్దకు కుటుంబ సభ్యులను తీసుకుని వచ్చి దాడికి పాల్పడి, దూషించారు. అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

–పి.మరియమ్మ, తెనాలి.

చోరీలో పురోగతిలేదు..

కొద్ది నెలలు క్రితం కుమార్తె పెళ్లి కుదిరింది. ఈ క్రమంలో బజారుకెళ్లాం. ఇంటికి వచ్చేసరికి బీరువాలో దాచిన కొత్త వస్త్రాలు, బంగారం, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. దీనిపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. సుమారు 5 నెలలు గడిచినా చోరీలో పురోగతి లేదు. న్యాయం చేయగలరు.

–సయ్యాద్ ఖాసింబీ, దాసరిపాలెం, గుంటూరు

సివిల్ సప్లయిూస్ డీటీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చేబ్రోలు: పౌరసరఫరాలశాఖ డెప్యూటీ తహసీల్దారు రేషన్ డీలర్ల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పాతరెడ్డిపాలేనికి చెందిన డీలర్ పులి సుభాషిణి, జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సీఎస్ డీటీ భువనేశ్వరి ప్రతి నెలా డీలర్ల వద్ద మాములు వసూళ్లకు చేబ్రోలుకు చెందిన డీలర్ల అసోసియేషన్ నాయకుడిని ఎంపిక చేసుకున్నారన్నారు. మాములు ఇవ్వలేదనే కారణంతో తన డీలర్‌షిప్‌ను రద్దు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని డీలరు పులి సుభాషిణి కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా పిర్యాదు చేశారు.

హైస్కూల్‌లో సిక్ రూం ఏర్పాటు వినూత్న ఆలోచన

చీరాల అర్బన్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల కోసం సిక్ రూం ఏర్పాటు చేయడం వినూత్న ఆలోచన అని ఎమ్మెల్సీ పి.కల్పలతారెడ్డి అన్నారు. సోమవారం చీరాల మండలం ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆమె పరిశీలించారు. హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లును ప్రశంసించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం నిర్వహణ జరుగుతుందని సంతృప్తి వ్యక్తం చేశారు.

మీ మొబైల్‌ఫోన్ పోయిందా..

- వాట్సాప్ నంబర్‌కు విశేష స్పందన
- ప్రారంభించిన రోజుల వ్యవధిలో.. ఐదు మొబైల్‌ఫోన్లు గుర్తింపు
- మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించిన జిల్లా ఎస్పీ

నగరంపాలెం: గతంలో మొబైల్‌ఫోన్ పొగోట్టుకున్నా.. ఎవరైనా దొంగలించినా ఆ మొబైల్ ఫోన్ మరలా సెల్ ఫోన్ దారుని వద్దకు చేరాలంటే కష్టంగా ఉండేది. ఒక్కొక్కసారి ఫోన్ దొరక్క.. కొత్త మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఎక్కువ.. ప్రస్తుతం అటువంటి ఇక్కట్లు ఉండవు.. ఎందుకంటే గత నెల 28న గుంటూరు జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమాన్నికి శ్రీకారం చుట్టారు. మీ మొబైల్ ఫోన్ పోయినట్లైతే గుంటూరు పోలీస్ వాట్సాప్ 8688831574 నంబర్‌కు హాయ్ అని మేసేజ్ చేయమని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ జిల్లా ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఐదుగురి మొబైల్‌ఫోన్లను జిల్లా పోలీసులు గుర్తించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్, నోడల్ అధికారిణి/ ఏఎస్పీ(పరిపాలన) కె.సుప్రజ, ఎస్‌బీ సీఐ నరసింహారావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటకృష్ణ బాధితులకు పొగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను తిరిగి అప్పగించారు..

గుంటూరు టౌన్‌లో ఉండే ఎండూరి హేమంత్‌కుమార్ మొబైల్ ఫోన్ 2021లో పొగోట్టుకున్నారు. పోలీస్ వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మేసేజ్ పెట్టారు..



బాధితులకు మొబైల్‌ఫోన్లను అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ సుప్రజ, ఎస్‌ఐ వెంకటకృష్ణ

రోజుల వ్యవధిలోనే పొగోట్టుకున్న 8 ప్రో ఫోన్‌ను గుర్తించారు. అదే విధంగా పందిరి సుధాకర్ వీవో వీ 50 మొబైల్, ఎస్.మదన్‌మోహన్ (వీవో వీ 19), సీహెచ్. మాధూరి (వీవో వీ 9), వేణిగంట నాగభూషణ్ (వీవో ఎస్ 1) పొగోట్టుకున్న మొబైల్‌ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల మొబైల్‌ఫోన్లను పొగోట్టుకున్న బాధితుల సంఖ్య అధికమవుతుందని, దీంతో బాధితుల సౌకర్యార్థం ఈ వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. వాట్సాప్ నంబర్‌కు నోడల్ అధికారిణిగా ఏఎస్పీ సుప్రజ ఉన్నారని పేర్కొన్నారు. బాధితులు పీఎస్‌లకు రాకుండా ఉన్న చోట నుంచే ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఏఎన్‌యూ విద్యార్థి

ఏఎన్‌యూ: రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు పతకాలు సాధించిన ఏఎన్‌యూ అథ్లెట్ వి.భాస్కరరావును సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అభినందించారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పోటీలలో యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల గ్రామీణాభివృద్ధి విభాగ విద్యార్థి, అథ్లెట్ భాస్కరరావు లాంగ్‌జంప్‌లో బంగారు పతకం, 400 మీటర్ల పరుగులో రజిత పతకం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. త్వరలో పూణెలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పారా ఒలంపిక్స్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భాస్కరరావు జాతీయ స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్, గ్రామీణాభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ వి.దివ్యతేజోమూర్తి పాల్గొన్నారు.



అథ్లెట్‌భాస్కరరావును సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్, పక్కన రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ

సెలవు మంజూరుకు భారీ లంచం

- వాట్సాప్ గ్రూపుల్లో బాధితుడు ఆరోపణ
- ఆర్డీ కార్యాలయంపై ఫిర్యాదు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సెలవు మంజూరుకు పెద్ద మొత్తంలో లంచాలు అడుగుతున్నారంటూ వైద్య ఉద్యోగి, ఏపీ ఎన్జీవో నాయకుడు సోమవారం వాట్సాప్ గ్రూపు వేదికగా ఆరోపణలు చేశాడు. తన బంధువు హెడ్ నర్సుగా పనిచేస్తూ ప్రభుత్వ అనుమతి తీసుకుని అమెరికా వెళ్లగా, ఆమెకు సెలవు మంజూరుకు భారీ స్థాయిలో డబ్బులు అడిగి ఇవ్వకపోవడం వలన మంజూరు చేయకుండా తిప్పుతున్నారంటూ ఆరోపించారు. ప్రతి పనికి కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే పనులు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకపోతే నరకం చూపిస్తూ దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఏపీ ఎన్జీవో నాయకులు తనకు న్యాయం చేయాలంటూ వాట్సాప్ గ్రూపు ద్వారా కోరారు. కాగా ఈ విషయంపై గుంటూరు ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్‌ను వివరణ కోరగా, నిబంధనల ప్రకారం సెలవు మంజూరు చేస్తామన్నారు. సెలవు మంజూరుకు భారీ స్థాయిలో మామూళ్లు అడిగినట్లు వస్తున్న ఆరోపణలు పూర్తి నిరాధారమైనవని చెప్పారు. నిజంగా సిబ్బంది డబ్బులు అడిగినట్లు తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే విషయాన్ని తనను కలిసిన ఏపీ ఎన్జీవో నేతలకు కూడా తెలియజేశానని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని నుదురుపాడు శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. గురజాల మండలం గోగులపాడుకు చెందిన కరుణాకరరెడ్డి, దొనకొండ మండలం చందవరానికి చెందిన రవిచంద్రారెడ్డి గుంటూరులోని ఓ ప్రయివేటు కళాశాలలో చదువుతున్నారు. ఉదయం గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వెళ్తుండగా నుదురుపాడు గ్రామశివారులోని ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కరుణాకరరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా రవిచంద్రారెడ్డికి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నరసరావుపేటకు 108లో తరలించారు.

కబడ్డీ ఉమ్మడి గుంటూరు బాలబాలికల జట్ల ఎంపిక





బాపట్ల అర్బన్: కబడ్డీ ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్– 19 బాలబాలికల జట్ల ఎంపిక సోమవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈనెల 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పీడీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన జట్లను సరస్వతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వేదవతి అభినందించారు. కార్యక్రమంలో పీడీలు కత్తి శ్రీనివాసరావు, ఉదయ్‌భాస్కర్, కోటేశ్వరమ్మ, డి.శైలజ, వై.సాంబశివరావు, టి.సాంబశివరావు పాల్గొన్నారు.

ది సౌత్ ఇండియన్ బ్యాంక్ రీజనల్ ఆఫీస్, హైదరాబాద్
SOUTH INDIAN Bank
నం. 167/6, మొదటి అంతస్తు, CHAI కాంప్లెక్స్, స్టాఫ్ రోడ్, [illegible] సికింద్రాబాద్–500009

REF : RO-HYD/GEN/604/2022-23

అనుబంధం-IV-A
(రూల్ 8(6)కు నిబంధనలు చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

[illegible] 2002 [illegible] 15.06.2022 [illegible] రూ. 6,31,52,363.03 [illegible] రూ. 6,49,73,118.74 [illegible] 01.03.2023 [illegible]

[illegible]